సాక్షి
మెదక్
బుధవారం । 31 । జూలై । 2024



ఆలోచన ఘనం...
క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా ఉపయోగంలోకి రావడంలేదు. ఆలోచన అద్భుతంగా ఉన్నా ఆచరణలో మాత్రం ఆమడ దూరంలో ఉన్నాయి. వివరాలు 10లో ▸



సేల్‌డీడ్ చేసుకున్నారు
టేక్మాల్ సహకార సంఘానికి దానం చేసిన భూమిని దాన పత్రం కింద రిజిస్ట్రేషన్ చేసుకుంటామని చెప్పి సేల్ డీడ్ చేసుకున్నారని రైతులు ఆరోపించారు. వివరాలు 10లో ▸



పోషకాలు అందిస్తే..
చెరకు పంటకు కావలసిన అన్ని రకాల పోషకాలను అందిస్తే ఆశించిన దిగుబడులు పొందొచ్చని శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. వివరాలు 10లో ▸

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలో హెచ్‌ఎం సుభాష్ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ, డీఎలు, సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించామని, వచ్చే నెల ఆగస్టు 2న ఎల్బీస్టేడియంలో ఉపాధ్యాయులతో సీఎం సమావేశం ఉంటుందని, ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, ఇన్‌చార్జి ఎంఈఓ బుచ్చానాయక్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పబ్బని శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి సుంకరి కృష్ణ, మండల నోడల్ అధికారి వెంకటేశం, రామచంద్రాచారి, మారుతి, బి.శ్రీనివాస్, విఠల్, రామక్రిష్ణాగౌడ్, విజయ్‌కుమార్, ఎస్.శ్రీనివాస్ తదితరులున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న మెదక్ ఆర్డీఓ రమాదేవి

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మెదక్ ఆర్డీఓ రమాదేవి పరిశీలించారు. మంగళవారం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహరెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక తనిఖీ చేశానని తెలిపారు. ఈ వర్షకాలంలో పాఠశాల చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాన్న లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేస్తున్నామని చెప్పారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజన అందించేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్ కుమార్, ఆర్ఐ గంగాధర్ గౌడ్, హెచ్‌ఎం జ్ఞానమాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

మెదక్‌జోన్: డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ (బీ.ఏ/బీ.కాం/బీ.ఎస్సీ) మొదటి సంవత్సరం కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు ఆగస్టు 18 వరకు చివరి గడువు ఉందని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా డిగ్రీ కోర్సుల్లో చేరడానికి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. విద్యార్హతలు, ఫీజు, కోర్సులు తదితర వివరాలను ఆన్‌లైన్‌లో పొందొచ్చని వెల్లడించారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజును ఆగస్టు 18 లోపు ఆన్‌లైన్‌లో చెల్లించాలని, అంతకు ముందు చేరిన విద్యార్థులు సకాలంలో ఫీజు చెల్లించలేక పోయిన వారు ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం 7382929570/580, 040–23680290 /291 /294/295 టోల్‌ఫ్రీ నెం. 18005990101లో సంప్రదించొచ్చని సూచించారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన



నిజాంపేట రికార్డులను పరిశీలిస్తున్న తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేషన్‌కు వచ్చే బాధితులపై మర్యాదగా వ్యవహరించాలని, వారికి న్యాయం జరిగేలా విచారణ చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జ్వర సర్వేపై అలక్ష్యమా..?

డీఎంహెచ్‌ఓ శ్రీరామ్ ఆగ్రహం
- నిర్లక్ష్యంగా ఉండొద్దని వైద్య సిబ్బందికి హెచ్చరిక
- నూరారంలో వైద్యశిబిరం



జ్వరంతో బాధపడుతున్న విద్యార్థి వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ శ్రీరామ్

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీరామ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని సూరారంలో డెంగీతో విద్యార్థి మృతితో అప్రమత్తమై స్థానికంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలించారు. జ్వరంతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డెంగీ వచ్చిన వెంటనే అప్రమత్తంగా ఉండాలని, వారి ఇంట్లోని వారందరికీ రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జ్వరంతో బాధపడుతున్న బక్కన రమేశ్‌తో మాట్లాడారు. 20 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నానని చెప్పారు. ఇప్పటి వరకు అందించిన టాబ్లెట్స్, రక్త పరీక్షల వివరాలను వైద్య సిబ్బందిని అడగగా ఎలాంటి పరీక్షలు నిర్వహించలేదని తేలడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తే సరిపోదని జ్వరంతో బాధపడున్నవారి వద్దకే వెళ్లి రక్త పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. రమేశ్ కాలు ఉబ్బడంతో స్వయంగా డీఎంహెచ్‌ఓ.. రక్త నమూనాలు సేకరించి, మలేరియా పరీక్షలు నిర్వహించారు. ఎలాంటి మలేరియా లేదని నిర్ధారించి ఇదే విషయాన్ని తెలిపారు. ఇలా వెంటనే ఆరోగ్య పరిస్థితిని వివరిస్తే ధైర్యంగా ఉంటారన్నారు. మరిన్ని పరీక్షల ఫలితం కోసం రక్త నమూనాలను టీ–హబ్‌కు పంపించి ఫలితాలు తెలుసుకోనున్నట్లు తెలిపారు. ఐదు రోజులకు సరిపడా మందులు అందించారు. గ్రామంలో వైద్య సిబ్బంది సర్వే ద్వారా 9 మందికి జ్వరం ఉందని చెప్పారు. ఇదే విషయమై ఆర్‌ఎంపీ వద్ద ఆరా తీస్తే వారం రోజుల్లో 40 మంది వరకు జ్వరంతో వచ్చి వైద్యం పొందారన్నారు. వారికి రక్త పరీక్షల కోసం పీహెచ్‌సీకి పంపడంతో పాటు జ్వరంతో వచ్చిన వారి వివరాలను నమోదు చేసుకుని మెడికల్ ఆఫీసర్‌కు తెలపాలని వైద్యసిబ్బందికి సూచించారు. మెడికల్ క్యాంపు వద్ద రికార్డుల్లో వారి పేర్లను, వారికి అందించిన మందుల వివరాలను చూసి ఎలాంటి రికార్డు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. మెడికల్ క్యాంపుకు వచ్చే వారి వివరాలు నమోదు చేయడంతో పాటు వారికి అందించిన మందుల వివరాలు కూడా నమోదు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధుకు పలు సూచనలు చేశారు. తాను మళ్లీ వచ్చి ఇక్కడ పరిశీలించనున్నట్లు తెలిపారు. గ్రామంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామ కార్యదర్శి నాంపల్లికి సూచించారు. ప్రజలు సహకరించి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నవీన్, మలేరియా అధికారి డాక్టర్ విజేందర్ ఉన్నారు.

దేవులపల్లిలో డెంగీ దడ

- ముగ్గురికి నిర్ధారణ
- ఒకరికి తగ్గిన ప్లేట్‌లెట్స్
- ధ్రువీకరించిన వైద్యులు
- గ్రామంలో వైద్యశిబిరం.. రక్త నమూనాల సేకరణ



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్యబృందం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని దేవులపల్లిలో డెంగీ కలకలం రేగింది. ముగ్గురికి నిర్ధారణ అయ్యింది. ఇంకొకరికి ప్లేట్‌లెట్స్ తగ్గాయి. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జింక దుర్గాప్రదాస్ జ్వరంతో బాధపడుతూ స్థానికంగా చికిత్స చేయించుకున్నాడు. తగ్గకపోవడంతో హైదరాబాద్ మల్లారెడ్డి ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ పరీక్షలు తర్వాత వచ్చిన రిపోర్టుల ఆధారంగా డాక్టర్లు డెంగీగా నిర్ధారించారు. దీంతోపాటు వారం క్రితం చాకలి మహేశ్‌కు డెంగీ రావడంతో చికిత్స తీసుకుని ఇంటివద్ద ఉంటున్నాడు. ప్రస్తుతం అతని తమ్ముడు వికాస్, అదే గ్రామానికి చెందిన వెల్పుగొండ నర్సింహులు జ్వరంతో మెదక్ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన వికాస్, వెల్పుగొండ నర్సింహులు జ్వరంతో మెదక్ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇద్దరికి ప్లేట్‌లెట్స్ తగ్గడంతో డెంగీగా అనుమానం వ్యక్తం చేశారు. అందులో వికాశ్ కూడా డెంగీ బారిన పడ్డాడని వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయం తెలియడంతో మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ వైద్యసిబ్బంది గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. బాధిత కుటుంబాలకు చెందిన వ్యక్తులతోపాటు పరిసరాలలో ఉన్న 14 మందికి డెంగీ నిర్ధారణ పరీక్షల కోసం రక్త నమూనాలు తీసుకుని ల్యాబ్‌కు పంపించారు. బాధితులు, గ్రామస్తుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటేశం గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్యం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రమేశ్, ఏఎన్‌ఎంలు శిరోమణి, శోభ, శ్రీధర్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ సల్మాన్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, ఆశావర్కర్లు, గ్రామస్తులు ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి : డీఎంహెచ్‌ఓ శ్రీరాం

మండలంలోని దేవులపల్లిలో ఫీవర్ సర్వే చేసి వైద్య చికిత్సలు అందిస్తామని, గ్రామస్తులు ఆందోళన చెందవద్దని డీఎంహెచ్‌ఓ శ్రీరాం తెలిపారు. మంగళవారం గ్రామంలో ఆయన పర్యటించి పరిసరాలను పరిశీలించారు. గ్రామస్తులు, అధికారులు, వైద్యసిబ్బందితో కలిసి ఆయన మాట్లాడి సూచనలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం పనులు చేపట్టాలన్నారు. మురుగు నీరు నిల్వకుండా చూడాలన్నారు. వేడిచేసి చల్లార్చిన నీరు తాగాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో ఇప్పటికే వైద్యశిబిరం ఏర్పాటు చేయగా ఫీవర్ సర్వే చేయాలని మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించారు. వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలని నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ ఏఓ నవీన్, స్థానిక వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రూ.202.98 కోట్ల రుణమాఫీ



రుణమాఫీ చెక్కును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- 21,517 మంది రైతులకు లబ్ధి
- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- అర్హులందరికీ రుణమాఫీ
- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ కలెక్టరేట్: రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులోభాగంగా అర్హులందరికీ రెండో విడతలో రుణమాఫీ అవుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం రుణమాఫీ రెండో విడత కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన నేపథ్యంలో మెదక్ కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి కలెక్టర్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ విడతలో జిల్లావ్యాప్తంగా 21,517 మంది రైతులకు రూ.202.98 కోట్ల రుణ మాఫీ అయ్యిందని చెప్పారు. రెండు లక్షల లోపు రుణాలు కూడా త్వరలోనే మాఫీ అవుతాయని తెలిపారు.

రెండు విడతల్లో రూ.441.79కోట్లు

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన రెండు విడతల్లో 69,495 మంది రైతుల ఖాతాల్లో రూ.441.79 కోట్ల రుణమాఫీ నిధులు జమ అయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఏమైనా సందేహాలు, సమస్యలుంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. జిల్లా, మండల క్షేత్రస్థాయిలో ప్రత్యేక ఫిర్యాదు విభాగాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

బ్యాంకర్లు సహకరించాలి:

రుణమాఫీ జరిగిన రైతుల ఖాతాలను రెన్యువల్ చేసి వారికి కావాల్సిన డబ్బులను వెంటనే విడుదల చేయాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, జిల్లా సహకార శాఖ అధికారి కరుణ, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ నర్సింహ్మామూర్తి, పీఏసీఎస్ చైర్మన్లు, వ్యవసాయ అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చాలా సంతోషంగా ఉంది



నాకు రూ.70వేల రుణమాఫీ వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో మాఫీ చేస్తామని చెప్పారు. కానీ చేయలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించింది.

–రమేష్, రాయిపల్లి, మెదక్.

రూ.20వేలు మాఫీ అయ్యాయి



గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చేయలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయడం సంతోషంగా ఉంది. నాకున్న 14 గుంటల భూమికి రూ. 20 వేలు మాఫీ వచ్చింది.

– మైసయ్య, మంగల్‌పర్తి, వెల్దుర్తి




సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రుణమాఫీ చేసినందుకు మంగళవారం చిలప్‌చెడ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు –చిలప్‌చెడ్(నర్సాపూర్)

మందుబాబుల అడ్డాగా బడులు

- మితిమీరుతున్న ఆగడాలు
- ఎటుచూసినా మద్యం బాటిళ్లు, వ్యర్థాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



జెడ్పీ ఉన్నత బాలికల పాఠశాల ఆవరణలో మందు బాటిళ్లు

నర్సాపూర్: సర్కారు బడులు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. వారి ఆగడాలు మితిమీరుతున్నాయి. నర్సాపూర్‌లోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణాలన్నీ రాత్రి అయ్యిందంటే చాలు మందు బాబులతో నిండిపోతున్నాయి. మద్యం సేవించి ఎక్కడ పడితే అక్కడ బాటిళ్లు పారవేస్తున్నారు. కొందరు బాటిళ్లను పగుల కొడుతుండటంతో విద్యార్థులు, స్థానికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఖాళీ మందు బాటిళ్లతో పాటు తినుబండారాల వ్యర్థాలు, ఇతర వస్తువులను ఇష్టానుసారంగా దర్శనమిస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా మంగళవారం ఉదయం సైతం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో, మెట్లపై ఖాళీ మందు బాటిళ్లు, తినుబండారాల వ్యర్థాలు కన్పించాయి.

పోలీసుల గస్తీ లేకపోవడమే..

రాత్రి వేళ పోలీసుల గస్తీ లేకపోవడమే మందుబాబుల ఆగడాలు హెచ్చుమీరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై పాఠశాల హెడ్‌మాస్టర్‌తో ప్రస్తావించగా ఆవరణలో ఖాళీ మందు సీసాలు, ఇతర వ్యర్థాలు పడి ఉంటున్నాయన్నారు. రోజూ గాజు పెంకులు తీయడం కష్టంగా మారుతోందన్నారు. విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. స్థానిక ఎస్ఐ పుష్పరాజ్‌ను వివరణ కోరగా కాలేజీ, పాఠశాలల ఆవరణలో మందు తాగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. రాత్రి వేళ పెట్రోలింగ్ చేపడతామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ఎవరైనా మందు తాగుతూ తమకు చిక్కితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

బోధనలో ప్రమాణాలు పాటించాలి

జిల్లా విద్యాధికారి రాధాకిషన్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

టేక్మాల్(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పిలుపునిచ్చారు. మంగళవారం బొడ్మట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బొమ్మలతో కూడిన విద్యనందిస్తూ నైపుణ్యతను పెంపొందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని, విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపర్చాలని సూచించారు. ఎటువంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఏఎంఓ సుదర్శనమూర్తి, హెచ్‌ఎం షాజిద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులేరీ?

- 2021లో స్కావెంజర్ వ్యవస్థ రద్దు
- ఆ బాధ్యతలు పంచాయతీ కార్మికులకు అప్పగింత
- కొన్ని చోట్ల పారిశుద్ధ్య పనులు చేస్తున్న విద్యార్థులు
- ఇటీవల సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో నిలిచిన నిధులు

సర్కారు బడుల్లో స్వీపర్ల కొరత వేధిస్తోంది. దీంతో పాఠశాలల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. 2021 స్కావెంజర్ల వ్యవస్థ రద్దు చేసి ఆ బాధ్యతలను పంచాయతీ కార్మికులకు అప్పగించారు. గ్రామ పంచాయతీలు జీతాలు సవ్యంగా చెల్లించకపోవడంతో సొంతగా డబ్బులు వెచ్చించి ఉపాధ్యాయులే నియమించుకుంటున్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులే పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. పాపన్నపేట మండలంలో దుస్థితి ఇదీ.

– పాపన్నపేట(మెదక్)




పాడిచన్‌పల్లి పాఠశాలలో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న ప్రైవేట్‌గా నియమించుకున్న మహిళ

మెదక్ జిల్లాలో 607 ప్రాథమిక, 124 ప్రాథమికోన్నత, 140 ఉన్నత పాఠశాలలున్నాయి. 90 శాతం పాఠశాలల్లో స్వీపర్లు లేరు. దీంతో 2016లో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి స్కావెంజర్‌లను నియమించారు. అటెండర్, స్వీపర్ లేని పాఠశాలకు ఒక స్కావెంజర్, నైట్ వాచ్‌మెన్ పోస్టులు మంజూరు చేశారు. వీరికి మొదట్లో నెలకు రూ.3 వేల జీతం ఇచ్చారు. అనంతరం దాన్ని రూ.2,500లకు కుదించారు. ప్రాథమిక పాఠశాలలో రూ.2,000 ఇచ్చారు. 2021 సెప్టెంబర్ నుంచి స్కావెంజర్ వ్యవస్థను రద్దు చేశారు. ఈ బాధ్యతలను సంబంధిత గ్రామ పంచాయతీలో ఉన్న పారిశుద్ధ్య కార్మికులకు అప్పగించారు. జనవరి 31న సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో, అప్పటి నుంచి పంచాయతీలకు నిధుల వరద ఆగిపోయింది. దీంతో పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది.

పాఠశాలల్లో పారిశుద్ధ్యం ఎలా?

జిల్లాలో 469 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో వెయ్యికి లోపు జనాభా ఉన్నవి 191 ఉన్నాయి. వీటికి సరిపోయే నిధులు రాక, కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. దీంతో వారు ఇటు పంచాయతీలో అటు పాఠశాలలో పారిశుద్ధ్య విధులు నిర్వహించడానికి ముందుకు రావడం లేదు. ముఖ్యంగా చిన్నపాటి గిరిజన తండాల్లోని స్కూళ్లలో ఈ సమస్య మరింత జటిలంగా మారింది. కొన్ని చోట్ల సమీప ఇళ్లలోని మహిళలు, మధ్యాహ్న భోజన కార్మికుల సహాయంతో టీచర్లు పాఠశాల పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారు. వారు సహకరించని పరిస్థితిలో విద్యార్థులే ఆ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో టీచర్లు ఎస్ఎంసీ నిధుల నుంచి సొంత డబ్బులతో కార్మికులను నియమించుకుంటున్నారు. అయితే ఇటీవల పంచాయతీలకు కొన్ని బకాయి నిధులు వచ్చినట్లు సమాచారం.

వెంటనే స్కావెంజర్లను ఏర్పాటు చేయాలి



పాఠశాలలో స్కావెంజర్లను వెంటనే ఏర్పాటు చేయాలి. పారిశుద్ధ్య కార్మికులు లేక, అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతుంది. దీంతో చేసేది లేక నెలకు రూ.3 వేలు సొంతత నిధులు చెల్లించి ప్రైవేట్ వ్యక్తులను నియమించుకున్నాం. ఏకోపాధ్యాయ పాఠశాలలు, తండా పాఠశాలల పరిస్థితి ఘోరంగా ఉంది.

–ప్రతాప్ రెడ్డి, హెచ్‌ఎం, పాడిచన్‌పల్లి

క్లుప్తంగా

పంటకు పోషకాలు అందిస్తే మంచి దిగుబడులు

శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్



రేజింతల్‌లో చెరకు పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్న విజయ్‌కుమార్

న్యాల్‌కల్(జహీరాబాద్): చెరకు పంటకు కావలసిన అన్ని రకాల పోషకాలను అందిస్తే ఆశించిన దిగుబడులు పొందొచ్చని బసంత్‌పూర్ గల ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం చెరకు పంట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రేజింతల్.. రైతులతో కలిసి శాస్త్రవేత్తలు, మాటూర్ శివారులో గల గోదావరి–గంగా చెరకు పరిశ్రమ ప్రతినిధులు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడారు. పంటకు కావలసిన పోషకాలు అందకపోవడం వల్ల సరైన ఎదుగుదల లేక దిగుబడులు తగ్గుతాయన్నారు. పోషక అవసరాలను దృష్టిలో పెట్టుకొని చివరి దశలో 50 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ ఎరువులను వేయాలని రైతులకు సూచించారు. చెరకులో అక్కడక్కడ సూక్ష్మ పోషకమైన బోరాన్ లోపం కనిపించిందన్నారు. నివారణకు 1 గ్రాము బోరాక్స్ లీటర్ నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. తెల్లనల్లి నివారణకు 3 మిల్లీ లీటర్ల క్లోరీపైరిఫాస్ ద్రావణాన్ని ఆకుల అడుగు భాగంలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ విష్ణు వర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ములుగు(గజ్వేల్): ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం, నేషనల్ రియల్ ఎస్టేట్‌డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్ఏఆర్ఈడీసీఓ)ల మధ్య మంగళవారం అవగాహన ఒప్పందం కుదిరింది. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్.బి నీరజ, నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ప్రతినిధులు విజయ సాయిమేక, బోగ ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, కాశిప్రసాద్‌లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందంతో వెంచర్స్, లేఅవుట్ నిర్వహణ కోసం నైపుణ్యం కలిగిన విద్యార్థులను అందిస్తామన్నారు. ఎన్ఏఆర్ఈడీసీఓ సభ్యులకు ప్రకృతి దృశ్యం, కూరగాయల తోటలు, ఇండోర్ మొక్కలు, పూల పెంపకం అంశాలలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడమే ప్రధాన ఎజెండా అని పేర్కొన్నారు. సమావేశంలో యూనివర్సిటీ అధికారులు భగవాన్, కిరణ్‌కుమార్, రాజశేఖర్, విజయం, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల హుండీ ఆదాయం రూ 50.28 లక్షలు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గ భవాని దేవి ఆలయ హుండీ ఆదా యం రూ.50,28,595 వచ్చినట్లు ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో కృష్ణమోహన్ తెలిపారు. 70 రోజుల అనంతరం రాజరాజేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం హుండీలెక్కింపు నిర్వహించా రు. మిశ్రమ బంగారం, వెండి కానుకలతో పాటు నగదు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రంగారావు, పాలక మండలి సభ్యులు వెంకటేశం, మనోహర్, చక్రపాణి, మోహన్‌రావు, పెంటయ్య, నాగభూషణం, రఘు, యాద య్య, సాయిలు, బాగా రెడ్డి, తోపాటు ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్ శర్మ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆలోచన ఘనం... ఆచరణ శూన్యం!

నిరుపయోగంగా గ్రామీణ క్రీడా ప్రాంగణాలు

- ఆటలకు పనికిరాని వైనం
- పిచ్చి మొక్కలతో దర్శనం
- వినియోగంలోకి తీసుకు రావాలంటున్న గ్రామీణ ప్రాంత యువత



గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన మర్కుక్ క్రీడా ప్రాంగణం

మర్కుక్(గజ్వేల్): గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను గుర్తించి, క్రీడాభివృద్ధికి పెద్ద పీట వేయాలనే ఉద్దేశంతో తెలంగాణ క్రీడా ప్రాంగణాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ప్రతి గ్రామ పంచాయతీకి క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసింది. ఆలోచన అద్భుతంగా ఉన్నా ఆచరణలో మాత్రం ఆమడ దూరంలో ఉంది. క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి సంవత్సరాలు గడుస్తున్నా ఉపయోగంలోకి మాత్రం తీసుకు రాలేదు. ఇవి పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. అధికారులు మాత్రం క్రీడలకు అనుగుణంగా ఉండే స్థలాలను మాత్రం ఎంచుకోలేదని తెలుస్తోంది. ప్రభుత్వం చెప్పింది కదా అని ఏదో ఒక చోట నిర్మించి చేతులు దులుపుకున్నారు. కొన్ని చోట్ల ప్రాజెక్ట్ కాల్వల పక్కన మరి కొన్ని చోట్ల ఎత్తు పల్లాలు, గుట్టలు ఉన్న స్థలాల్లో నిర్మించారు.

- సిద్దిపేట జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీకి తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని నిర్మించారు. ప్రభుత్వ స్థలాలలను గుర్తించి ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద లక్షల రూపాయలు ఖర్చుపెట్టి క్రీడా సామగ్రి, బోర్డులను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క గ్రామ క్రీడా ప్రాంగణానికి రూ. 40 వేలు వెచ్చించి బోర్డులు, క్రీడా సామగ్రి ఏర్పాటు చేశారు. ఒక మర్కుక్ మండలంలోనే 16 గ్రామ పంచాయతీలకు ఒక్కో దానికి రూ. 6.40 లక్షల నిధులు ఖర్చు పెట్టారు. అప్పటి నుంచి క్రీడా ప్రాంగణాల్లో పోటీలు నిర్వహించలేక పోగా గాలికి వదిలేశారు. సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఆచరణలోకి తీసుకురాక పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.
- మర్కుక్, ములుగు, వర్గల్, గజ్వేల్, జగదేవ్‌పూర్, కొండపాక మండలాలతోపాటు జిల్లాలో క్రీడా ప్రాంగణాలు పిచ్చి మొక్కలు, పశువుల మేతకు ఉపయోగపడుతున్నాయని పలువురు మండి పడుతున్నారు. పేరుకే తప్ప వాటిని వినియోగించడం లేదని నిర్మించిన నాటి నుండి వాటిని పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని గ్రామీణ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో క్రీడలకు అనుకూలంగా లేని స్థలాల్లో ఆఘమేఘాల మీద నిర్మించి గాలికి వదిలేశారు. వాటిని చూడడానికి తప్ప ఆడటానికి ఏ మాత్రం ఉపయోగం లేదు. గత ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు ఇవి ఏర్పాటు చేస్తే అధికారులు వాటిని పట్టించుకోకుండా గాలికి వదిలేశారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.
- మర్కుక్ మండలం నర్సన్నపేటలో కొండపోచమ్మ సాగర్ కాల్వ పక్కనే ఏర్పాటు చేశారు. గణేశ్‌పల్లిలో ఎత్తు పల్లాలు, పెద్ద పెద్ద గుండ్ల మధ్యన ఏర్పాటు చేశారు. ఎర్రవల్లి, దామరకుంట, కర్కపట్ల గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. మర్కుక్ లో సుమారు కిలో మీటర్ దూరం, ఎర్రవల్లి గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు చూడటానికి తప్ప ఆటలు ఆడ డానికి వీలు లేకుండా పోయిందని యువకులు చెబుతున్నారు. అధికారులు గ్రామాల్లో వాటి గురించి అవగాహన కల్పించకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందంటున్నారు. గ్రామ సమీపంలో నిర్మించాలి తప్ప ఎక్కడో నిర్మిస్తే ప్రయోజనం ఏముంటుందని, ప్రజాధనం వృథా చేయడం తప్ప మరొకటి లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామీణ ప్రాంత యువకులు, క్రీడాకారులు కోరుతున్నారు.



పశువులకు మేతగా మారిపోయిన క్రీడా ప్రాంగణం

దానం ఇస్తే... సేల్‌డీడ్ చేశారు

- రైతుల ఆవేదన
- పీఏసీఎస్ అధికారుల నిర్వాకం



టేక్మాల్ పీఏసీఎస్ కార్యాలయం

టేక్మాల్(మెదక్): టేక్మాల్ సహకార సంఘానికి దానం చేసిన భూమిని దాన పత్రం కింద రిజిస్ట్రేషన్ చేసుకుంటామని చెప్పి సేల్ డీడ్ చేసుకున్నారని మంగళవారం రైతులు ఆరోపించారు. తప్పుదోవ పట్టించి ఇష్టారాజ్యంగా డబ్బులను డాక్యుమెంట్‌లో పొందుపర్చుకుని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పీఏసీఎస్ అధికారులపై మండిపడ్డారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. టేక్మాల్‌లోని చిలకమర్రి కుటుంబ సభ్యులైనా నారాయణరెడ్డి, బ్రహ్మారెడ్డి, లక్ష్మారెడ్డిలు సర్వే నంబర్ 1952లో 2 ఎకరాల 12 గుంటల భూమిని గతంలో దానం చేశారన్నారు. ఇది వారి మనువళ్ల మీదకు రాగా పీఏసీఎస్ అధికారులు గ్రామ పెద్దల సమక్షంలో ఒప్పించి దాన పత్రం కింద రిజిస్ట్రేషన్ చేసుకొని తమ తాతల పేర్లను శిలాఫలకం మీద పెడతామని చెప్పారన్నారు. భూ రిజిస్ట్రేషన్ నిమిత్తం పీఏసీఎస్ అధికారులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి రైతులతో వెళ్లిన తర్వాత దాన పత్రం కింద పని చేయదంటూ సెల్ డీడ్ ద్వారానే రిజిస్ట్రేషన్ చేయాలని కోరారన్నారు. అప్పుడు సెల్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. 2018లో భూమిని దాన పత్రం కింద రిజిస్ట్రేషన్ చేసినందుకు గాను పీఏసీఎస్ తరఫున గ్రామస్తుల ఒప్పందంతో రైతులకు రూ.3 లక్షల నగదు అందించారని తెలిపారు. కానీ డాక్యుమెంట్‌లో రూ.27.83 లక్షలు ఇచ్చినట్లు పేర్కొనడంపై మండిపడుతున్నారు. ఈ విషయమై రైతులు పీఏసీఎస్ కార్యాలయానికి వెళ్లి తెలుసుకునేందుకు ప్రయత్నించినా అక్కడ సీఈఓ లేకపోవడం, ఫోన్‌లో కూడా అందుబాటులోకి రాలేదన్నారు. అదనపు డబ్బును పొందుపర్చినా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంపై అసహనం వ్యక్తం చేశారు. ఎందుకు అంత పెద్ద అమౌంట్ పొందుపరిచారో అధికారులు చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. కాగా, ఈ విషయమై బ్యాంక్ స్టేట్‌మెంట్‌తో పాటు అప్పటి ఆడిట్ బుక్‌ను ఉన్నతాధికారులు పరిశీలిస్తేనే అసలు విషయాలు బయటకు వస్తాయని తెలుస్తోంది. ఈ విషయమై సీఈఓ వేణుగోపాల్ వివరణ కోరేందుకు ఫోన్ చేయగా స్పందించలేదు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..
అనారోగ్య సమస్యలతో మరొకరు..



స్వామి (ఫైల్)

రాయపోలు(దుబ్బాక): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రాయపోలు మండలం కొత్తపల్లిలో చోటుచేసుకుంది. రాయపోలు ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పంగ స్వామి (35) ప్యాసింజర్ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి సొంతిల్లు లేకపోవడంతో ఐదేళ్ల క్రితం అప్పు చేసి నిర్మించుకున్నాడు. గతేడాది ఆటో కొన్నాడు. వాటి కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో పాటు ఆదాయం లేకపోవడంతో ఇటీవల దాన్ని సైతం అమ్మేశాడు. ఇటీవల అప్పుల వారి వేధింపులు అధికం కావడంతో మనోవేదనకు గురైన స్వామి ఈ నెల 28న రాత్రి కలుపు మందు తాగాడు. గమనించిన భార్య కల్పన కుటుంబసభ్యుల సాయంతో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించింది. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా ఇక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గజ్వేల్‌రూరల్: అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్‌లలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో నివాసముండే సత్యనారాయణకు ఇద్దరు భార్యలు, ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. సత్యనారాయణ మద్యానికి బానిస కాగా కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. సోమవారం రాత్రి తమకు కేటాయించిన తాత్కాలిక ఇంట్లో లోపలి నుంచి గొళ్లెం పెట్టుకొని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వచ్చి తలుపులు కొట్టినప్పటికీ తీయకపోవడంతో అనుమానంతో వాటిని తొలగించి చూసే సరికే మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై ..



సురేశ్ మృతదేహం

చేగుంట(తూప్రాన్): మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకొని మృతిచెందాడు. ఈ సంఘటన అనంతసాగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్ర సురేశ్‌గౌడ్(33) కొద్దిరోజులుగా మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. అప్పులెలా తీర్చాలో తెలియక లోలోన మదనపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు గ్రామానికి చేరుకున్న ఎస్ఐ పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య నవీన పోలీసులకు ఫిర్యాదు చేసింది.

3.80 కోట్ల మంది మహిళల ప్రయాణం

- డీలక్స్ బస్సుల్లో గిఫ్ట్ స్కీం ప్రారంభించాం
- ఆర్టీసీ మెదక్ ఆర్ఎం ప్రభులత

సిద్దిపేటకమాన్: ప్రభుత్వం మహిళలకు ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా మెదక్ రీజియన్‌లో ఇప్పటి వరకు 3.80 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు మెదక్ రీజియన్ ఆర్ఎం ప్రభులత మంగళవారం తెలిపారు. ప్రభుత్వం 6 గ్యారంటీలలో భాగంగా ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా మెదక్ రీజియన్‌లో రోజూ సుమారు లక్షా 70 వేల మంది ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. గతంలో 70 శాతం ఆక్యుపెన్సీ రేషియా ఉండగా ఇప్పుడు 98 శాతానికి చేరిందన్నారు. గతంలో రోజూ ఆర్టీసీ ద్వారా 1.80 లక్షల మంది ప్రయాణిస్తే నేడు 2.60లక్షల మంది సేవలను వినియోగించుకుంటున్నట్లు పేర్కొన్నారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా ప్రభుత్వం, యాజమాన్యం ఎన్నో రకాల చర్యలు చేపడుతున్నాయన్నారు. మెదక్ రీజియన్‌కు ఇప్పటి వరకు 10 డీలక్స్, 35 పల్లెవెలుగు, 42 ఎక్స్‌ప్రెస్ బస్సులతో పాటు మొత్తం 87 నూతన బస్సులు వచ్చాయన్నారు. డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు గిఫ్ట్ స్కీం పథకాన్ని సిద్దిపేట, మెదక్, జహీరాబాద్ డిపోల్లో ప్రారంభించామన్నారు.

భవిష్యత్‌లో మరిన్ని సేవలు

డెక్కన్ టోల్వే సంస్థ రీజినల్ హెడ్ వినీశ్‌కుమార్



కొత్త భవనాన్ని ప్రారంభిస్తున్న వినీశ్‌కుమార్

జహీరాబాద్: భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడుతామని డెక్కన్ టోల్వే సంస్థ దక్షిణ తెలంగాణ రీజినల్ హెడ్ వినీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం జహీరాబాద్‌లో డెక్కన్ టోల్వే ఆధ్వర్యంలో రూ.2కోట్లతో నిర్మించిన ఆరు తరగతి గదుల కొత్త జూనియర్ కళాశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎస్ఆర్ నిధులతో కళాశాల భవనం నిర్మించామన్నారు. డెక్కన్ టోల్వే, వడోదర బరుచ్ లిమిటెడ్ వారు నిధులను సమకూర్చినట్లు అన్నారు. ప్రస్తుతం తమ సంస్థ ద్వారా సంగారెడ్డి నుంచి మహారాష్ట్ర–కర్ణాటక సరిహద్దు వరకు 145 కి.మీ. మేర నాలుగు వరసల జాతీయ రహదారిని నిర్మిస్తున్నామన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారికి మంచి భవిష్యత్ ఇచ్చి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు హెడ్ రాజేశ్ విచారే, ప్రిన్సిపాల్ సుమలత, లెక్చరర్లు, విద్యార్థులు, డెక్కన్ టోల్వే సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా పనులు చేపట్టాలి

డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

కొల్చారం(నర్సాపూర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో అవినీతికి తావు ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా చేపట్టాలని మెదక్ డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద చేపట్టిన పనులపై ఎంపీడీఓ సమావేశ మందిరంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఏప్రిల్ 2023 నుంచి 2024 మార్చ్ 31 వరకు జరిగిన పనులపై గ్రామాల నివేదికలను చదివి వినిపించారు. మండలంలో ఈజీఎస్, పంచాయతీరాజ్ ద్వారా రూ.5 కోట్ల 47 లక్షల 97 వేలను ఖర్చు చేశారు. పూర్తి నివేదిక అనంతరం పనుల్లో రెండు శాఖలకు సంబంధించి రూ.47 వేలు సిబ్బంది నుంచి రికవరీ, పెనాల్టీ కింద రూ.18 వేలు లెక్క తేల్చారు. కార్యక్రమంలో డీవీఓ శ్రీహరి, హెచ్ఆర్ మేనేజర్ రాజేందర్ రెడ్డి, ఎంపీడీఓ కృష్ణవేణి, ఏపీఓ మహిపాల్ రెడ్డి, సీఆర్పీ, రవి, మండల ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్: సేంద్రియ వ్యవసాయంపై విజయవాడకు చెందిన విద్యార్థులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. మంగళవారం డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలకు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్‌కు చెందిన 14 మందికి పలు అంశాలపై వివరించారు. జహీరాబాద్ మండలం కాశీంపూర్, ఝరాసంగం మండలం బిడకన్నెలో లింగాకర్షక బుట్టల్లో పండు ఈగ వేయడంపై ప్రయోగపూర్వకంగా అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత గురించి తెలపడంతో పాటు ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించడం విధానంపై కూడా వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శైలజ గోగు, సాయి ప్రియాంక పాల్గొన్నారు.

డ్యూటీకి వెళ్తుండగా కబళించిన మృత్యువు

గుర్తుతెలియని వాహనం ఢీకొని మిషన్ భగీరథ హెల్పర్ మృతి



భిక్షపతి (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): గుర్తుతెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో మిషన్ భగీరథ హెల్పర్ మృతిచెందాడు. ఈ సంఘటన తూప్రాన్–నర్సాపూర్ హైవే చండి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.....గంగాయిపల్లికి చెందిన ఒగ్గు భిక్షపతి(55) మిషన్ భగీరథలో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం విధుల్లోకి వచ్చేందుకు గ్రామం నుంచి టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తుండగా తూప్రాన్–నర్సాపూర్ హైవే చండీ గ్రామ సబ్‌స్టేషన్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒగ్గు భిక్షపతి తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. అతనికి భార్య మల్లమ్మ, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మైపాల్‌రెడ్డి తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి ...



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పటాన్‌చెరు టౌన్: బుల్లెట్ ఢీ కొట్టిన ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్ఐ ఆసీఫ్ అలీ కథనం ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అమేధా ఆస్పత్రి ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై గత ఆదివారం గుర్తు తెలియని వ్యక్తిని బుల్లెట్ బండి ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతుడికి సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే పటాన్‌చెరు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



తిరుపతి (ఫైల్)

దుబ్బాకరూరల్: విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని రాజక్కపేటలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ గంగరాజ్ తెలిపిన వివరాలు... రాజన్న సిరిసిల్లా జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన కట్ట తిరుపతి యాదవ్(74) తన కూతురు గంధం నిర్మల రాజక్కపేటలో నూతనంగా ఇల్లు నిర్మించుకుంటుంది. నిర్మాణానికి సహాయపడుతూ ఇక్కడే రెండేళ్లుగా ఉంటున్నాడు. ఈనెల 29న పొలం వద్ద పశువులకు మేత కోసం ఇనుప కొడవలి తీసుకొని ఒడ్డుపై గడ్డిని కోస్తున్నాడు. విద్యుత్ స్తంభం నుంచి బోర్‌మోటార్‌కు సంబంధించిన స్టార్టర్ డబ్బాలోకి విద్యుత్ తీగ ఒడ్డుపై నుంచి సరఫరా అవుతుంది. దీంతో కొడవలి తీగకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇదే రోజు సాయంత్రం చుట్టుపక్కల రైతులు గమనించి తన కూతురుకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి గ్రామస్తులు, పోలీస్‌లు చేరుకున్నారు. మంగళవారం మృతుడి కుమారుడు గణేశ్ యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య

- హత్య చేశారంటూ బాధిత కుటుంబసభ్యులు, బంధువుల ఆందోళన
- వెంక్యాతండాలో ఉద్రిక్తత
- శివ్వంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయింపు
- పోలీసుల జోక్యంతో శాంతించిన ఆందోళనకారులు



రాస్తారోకో చేస్తున్న ఆందోళనకారులకు నచ్చచెబుతున్న సీఐ



కుమార్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కానీ చంపి ఆత్మహత్యగా చిత్రీకరించారంటూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రెడ్యా పంచాయతీ వెంక్యా తండాకు చెందిన గుగ్లోత్ కుమార్(28) ఆటో నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. నవాబుపేట పంచాయతీ రాములుతండాకు చెందిన మహేందర్ వెంక్యా తండాలో ట్రాక్టర్ పార్క్ చేశాడు. సోమవారం రాత్రి గగులోత్ కుమార్ పార్కింగ్ చేసిన ట్రాక్టర్ నుంచి బ్యాటరీ చోరీ చేస్తుండగా చూసిన తండాకు చెందిన వ్యక్తి ఆ విషయాన్ని యజమానికి చెప్పాడు. అదే రాత్రి మహేందర్‌తో పాటు అతని తండ్రి గెమ్‌సింగ్, మామ నర్సింహులు ఇక్కడికి చేరుకొని నిందితుడి నిలదీసి దాడి చేశారు. మరుసటి రోజు ఉదయం తండాలో పంచాయితీ పెడతామని హెచ్చరించారు. మంగళవారం ఉదయం భిక్షపతి తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కానీ కుమార్‌ను ముగ్గురు తీవ్రంగా కొట్టి హత్య చేసి ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించారంటూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పినప్పటికీ వినిపించుకోలేదు. తూప్రాస్ సీఐ రంగాకృష్ణ అదనపు బలగాలతో ఘటనస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో ఆందోళనకారులు శివ్వంపేట పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని తూప్రాన్– నర్సాపూర్ హైవేపై బైఠాయించి రాస్తారోకో చేశారు. హత్య చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారికి నచ్చజెప్పి శాంతింపజేశారు. రాత్రి వరకు మృతుడి కుటుంబసభ్యులు, దాడికి పాల్పడిన వారితో తండా పెద్దలు చర్చించారు. మృతుడి భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మైపాల్‌రెడ్డి తెలిపారు.